## పలువురికి హరీశ్‌రావు పరామర్శ



జర్నలిస్టు కృష్ణ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీమంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు

నంగునూరు, నవంబర్ 29 : మండలంలోని అక్కెనపల్లికి చెందిన జర్నలిస్టు చిలువేరు కృష్ణ తల్లి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. గ్రామానికి చెందిన మాజీ గ్రామశాఖ అధ్యక్షుడు యాదగిరిగౌడ్ భార్య అనారోగ్యంతో చనిపోగా వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు వెంట మండల ప్రజాప్రతినిధులు ఉన్నారు.

**రాఘవాపూర్‌లో...**

సిద్దిపేట కమాన్, నవంబర్ 29: సిద్దిపేట రూరల్ మండలం రాఘవాపూర్ బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు తిరుపతి ఇటీవల చికిత్స చేయించుకున్నాడు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అతడి ఇంటికి వెళ్లి పరామర్శించారు. పరామర్శించిన వారిలో ప్రజాప్రతినిధులు తదితరులు ఉన్నారు.

## లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న జడ్జి కృష్ణతేజ్

హుస్నాబాద్, నవంబర్ 29: కోర్టుల్లో కేసుల సత్వర పరిష్కారం కోసం నిర్వహించే లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని మున్సిపల్ కోర్టు జడ్జి కృష్ణతేజ్ కోరారు. శుక్రవారం హుస్నాబాద్ కోర్టులో పోలీసు అధికారులు, న్యాయవాదులతో ఏర్పాటు చేసిన లోక్‌అదాలత్ సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. కొందరు కక్షిదారులు చిన్న, చిన్న కేసులకే ఏండ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరుగుతుంటారని, అలాంటి వారిని రాజీ కుదిర్చి లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కారమయ్యేలా చూడాలన్నారు. డిసెంబర్ 14వ తేదీన జరగనున్న జాతీయ లోక్‌అదాలత్‌ను పోలీసులు, న్యాయవాదులు సమన్వయంతో ఉండి ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా చూడాలన్నారు. హుస్నాబాద్ సీఐ శ్రీనివాస్, ఎస్సై మహేశ్, కోర్టు పరిధిలోని పోలీసు అధికారులు, ఎక్సైజ్ అధికారులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

## మర్యాద పూర్వకంగా వ్యహరించాలి: సీపీ



పోలీసులకు సూచనలు చేస్తున్న సిద్దిపేట సీపీ డాక్టర్ అనురాధ

దుబ్బాక, నవంబర్ 29: పీఎస్‌కు వచ్చే బాధితుల పట్ల పోలీస్ సిబ్బంది మర్యాద పూర్వకంగా వ్యవహరించాలని సిద్దిపేట సీపీ డాక్టర్ బి.అనురాధ అన్నారు. శుక్రవారం దుబ్బాక పోలీస్ స్టేషన్‌ను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పీఎస్ పరిసరాలు, రికార్డులు, సీడీ ఫైల్స్‌ను పరిశీలించారు. సిద్దిపేట ఏసీపీ మధు, దుబ్బాక సీఐ శ్రీనివాస్, ఎస్‌బీ సీఐ శ్రీధర్ గౌడ్, కోర్టు లైనింగ్ సీఐ కమలాకర్, దుబ్బాక ఎస్సై గంగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



మర్కూక్: విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న జ్యోత్స్నరెడ్డి

మర్కూక్,నవంబర్ 29: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని తెలంగాణ విద్యా కమిషన్ సభ్యురాలు జ్యోత్స్నరెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్, ఎంపీపీఎస్‌ను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఉపాధ్యాయుడు శ్రీనివాస్‌రావు విద్యార్థులు పాల్గొన్నారు.

**కొండపాకలో..**

కొండపాక(కుకునూరుపల్లి), నవంబర్ 29 : విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని విద్యా కమిషన్ సభ్యురాలు జ్యోత్స్నరెడ్డి అన్నారు. కొండపాక మండల కేంద్రంలోని మోడల్ స్కూల్, ప్రాథమిక పాఠశాలను ఆమె సందర్శించారు. కార్యక్రమంలో ఎడ్యుకేషన్ కమిటీ సభ్యుడు జీనత్, డీఈవో ఎల్లంకి శ్రీనివాస్‌రెడ్డి, ఎంఈవో పి. శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులు శాస్త్రీయ ధృక్పథంతో ఆలోచించాలి



సైన్స్ ఫెయిర్‌ను పరిశీలిస్తున్న పీఆర్‌టీయూ ఎమ్మెల్సీ అభ్యర్థి వంగా మహేందర్‌రెడ్డి

సిద్దిపేట అర్బన్, నవంబర్ 29 : విద్యార్థులు శాస్త్రీయ ధృక్పథంతో ఆలోచించాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ (పీఆర్‌టీయూ) అభ్యర్థి వంగా మహేందర్‌రెడ్డి అన్నారు. సిద్దిపేట జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇన్‌స్పైర్, 52వ వైజ్ఞానిక ప్రదర్శనను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. శాస్త్ర సాంకేతిక రంగంలో ప్రపంచం పరుగులు తీస్తున్న సమయంలో విద్యార్థి దశ నుంచే శాస్త్రీయ ధృక్పథం విద్యార్థులు అలవర్చుకోవాలన్నారు. శాస్త్ర సాంకేతికత ఉపయోగించి వాతావరణ కాలుష్యాన్ని తగ్గించి పర్యావరణాన్ని పరిరక్షించుకునే విధంగా ఆలోచన ఉండాలని, రైతులకు సమాజానికి ఉపయోగపడే ఆవిష్కరణలు విద్యార్థులు రూపొందించాలన్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## గెలిపిస్తే ప్రశ్నించే గొంతుకనవుతా

సిద్దిపేట టౌన్, నవంబర్ 29: ఎమ్మెల్సీగా గెలిపిస్తే ప్రశ్నించే గొంతుకనవుతానని పట్టభద్రుల ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి గంగాధర్ అన్నారు. శుక్రవారం సిద్దిపేట బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలోజరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. అంతకు ముం దు న్యాయవాది లక్ష్మీనారాయణ గంగాధర్‌కు జ్ఞాపిక అందజేసి సత్కరించారు. న్యాయవాదులు సత్యనారాయణ, సాయిబాబా, ఆత్మ రాములు, పర్వతం రాములు పాల్గొన్నారు.

## సీపీఎం మహాసభను జయప్రదం చేయాలి

గజ్వేల్, నవంబర్ 29: గజ్వేల్ పట్టణంలో డిసెంబర్ 1,2 తేదీల్లో కోలా అభిరామ్ గార్డెన్స్‌లో నిర్వహించే సీపీఎం జిల్లా మూడో మహాసభను జయప్రదం చేయాలని ఆపార్టీ జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి కోరారు. ఈ సందర్భంగా శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మొదటి రోజు గజ్వేల్‌లో నిర్వహించే ర్యాలీలో మాజీ ఎంపీ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, కేంద్ర కమిటీ సభ్యుడు నాగయ్య, సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్కా రాములు పాల్గొంటారన్నారు. జిల్లాలోని సమస్యలపై తీర్మానాలు చేసి చర్చిస్తామన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన అనేక హామీలను అమలు చేయాలన్నారు. రాళ్లబండి శశిధర్, ఎల్లయ్యా, రంగారెడ్డి, ప్రవీణ్, ఐలయ్య పాల్గొన్నారు.

**కొండపాక మండలంలో..**

కొండపాక(కుకునూరుపల్లి), నవంబర్ 29 : గజ్వేల్ పట్టణంలో డిసెంబర్ 1,2వ తేదీల్లో నిర్వహించనున్న సీపీఎం జిల్లా మూడోమహాసభలను జయప్రదం చేయాలని ఆపార్టీ జిల్లా కమిటీ సభ్యుడు అమ్ముల బాలనర్సయ్య అన్నారు. శుక్రవారం కొండపాక మండలంలోని మర్పడగ, సిరిసినగండ్ల గ్రామాల్లో సీపీఎం జిల్లా మూడో మహాసభల కరపత్రాన్ని హమాలీ కార్మికులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో రవీంద్రాచారి, కొమురయ్య, లింగయ్య, మల్లేశం, ఎల్లయ్య, నర్సయ్య, అయిలయ్య, కనకయ్య, రాములు పాల్గొన్నారు.

## నకిలీ వైద్యులను అరికట్టే దిశగా దాడులు

గజ్వేల్, నవంబర్ 29: నకిలీ వైద్యులను అరికట్టే దిశగా మెడికల్ కౌన్సిల్ అధికారులు శుక్రవారం గజ్వేల్‌లోని పలు క్లినిక్స్‌పై ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. తెలంగాణ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ శ్రీనివాస్, ఎథిక్స్ కమిటీ సభ్యుడు డాక్టర్ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో 10 మంది ఆర్‌ఎంపీ వైద్యులపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు. గజ్వేల్ పట్టణంలో ప్రభుత్వ దవాఖాన పక్కనే ఉన్న డయాగ్నోస్టిక్ సెంటర్‌లో ఫిజియోథెరపిస్ట్ నకిలీ డాక్టర్ ప్రిస్క్రిప్షన్ రాసి పంపిన రోగులకు అల్ట్రా సౌండ్, సిటీ స్కాన్, ఎమ్మారై చేస్తున్నారని వెలుగులోకి వచ్చిందన్నారు. కిరిగిస్థాన్‌లో ఎంబీబీఎస్‌కు సమానమైన వైద్యవిద్యను అభ్యసించి ఓ దవాఖానలో ఎండీ వైద్య నిపుణుడిగా చలామణి అవుతున్నట్లు తెలిపారు. తనిఖీలో విచ్చలవిడిగా యాంటీబయోటిక్స్, స్టెరాయిడ్స్ ఇస్తున్నట్లు గుర్తించి ఆధారాలు సేకరించినట్లు తెలిపారు. వర్గల్, ములుగు మండలాల్లో కూడా తనిఖీలు చేపట్టామన్నారు.

**సిద్దిపేటలో దీక్షా దివస్ సక్సెస్**

# కదిలిన గులాబీ దండు

**తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు**

గులాబీ అధినేత కేసీఆర్ చేపట్టిన దీక్షాదివస్ ఫలితమే తెలంగాణ వచ్చిందని పలువురు నాయకులు అన్నారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలో బీఆర్‌ఎస్ తలపెట్టిన దీక్షా దివస్‌కు ఆయా మండలాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున తరలివెళ్లారు. అంతకు ముందు మండల కేంద్రాల్లో కేసీఆర్ చిత్రపటాలకు,తెలంగాణ తల్లి విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు.

– సిద్దిపేట జిల్లా నెట్‌వర్క్, నమస్తే తెలంగాణ, నవంబర్ 29:



గజ్వేల్: గజ్వేల్‌లో తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి మాట్లాడుతున్న ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి



కొమురవెల్లి: సిద్దిపేట పట్టణంలో జరిగే దీక్షా దివస్‌కు తరలి వెళ్తున్న బీఆర్‌ఎస్ కొమురవెల్లి నాయకులు



మద్దూరు(ధూళిమిట్ట): మద్దూరు నుంచి దీక్షాదివస్‌కు వెళ్లిన బీఆర్‌ఎస్ నేతలు



అక్కన్నపేట: దీక్షా దివాస్‌కు తరలివెళ్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



హుస్నాబాద్: సిద్దిపేటలోని అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న బీఆర్‌ఎస్ హుస్నాబాద్ నాయకులు



చేర్యాల: చేర్యాలలో తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ స్వరూపరాణీశ్రీధర్‌రెడ్డి

## జ్యోతిబాపూలే గురుకులంలో టాస్క్‌ఫోర్స్ తనిఖీలు



కోడిగుడ్లను పరిశీలిస్తున్న అధికారులు

హుస్నాబాద్‌రూరల్, నవంబర్ 29: మండలంలోని పోతారం(ఎస్)లోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో శుక్రవారం స్పెషల్ టాస్క్‌ఫోర్స్ బృందం తనిఖీ నిర్వహించింది. ఈ సందర్భంగా వారు హాస్టల్‌లో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం, హాస్టల్‌లోని వంట సామగ్రి, స్టోర్‌రూమ్‌లో ఉన్న కోడిగుడ్లు, పప్పులు, కూరగాయలను పరిశీలించారు. వంట గది, హాస్టల్ పరిసర ప్రాంతాలు, టాయిలెట్స్‌ను తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. హాస్టల్‌లో ఉన్న లోపాలను సరిచేయాలని ప్రిన్సిపాల్‌కు సూచనలు చేశారు.

## మృతుల కుటుంబాలకు ఆర్థికసాయం



మృతుల కుటుంబాలను పరామర్శిస్తున్న వెంకటయ్య

మిరుదొడ్డి (అక్బర్‌పేట-భూంపల్లి), నవంబర్ 29 : అక్బర్‌పేట-భూంపల్లి మండలంలోని భూంపల్లిలో ఇటీవల ఎర్మని రామస్వామి, అబ్బనమైన భద్రయ్య, బేగంపేటలో నీల కరుణాకర్ మృతి చెందారు. శుక్రవారం ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య మృతుల కుటుంబాలను పరామర్శించి ఒక్కొక్కరికీ రూ.5 వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట భూంపల్లి మాజీ ఉప సర్పంచ్ వడ్ల ప్రభాకర్, బేగంపేట మాజీ సర్పంచ్ అనసూయాప్రతాప్, గ్రామస్తులు అంజయ్య, అయితం శ్రీనివాస్, చందు, ప్రశాంత్ ఉన్నారు.

## విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేత



విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న ఎస్‌వో భాస్కర్

మిరుదొడ్డి, నవంబర్ 29: విద్యార్థులు పట్టుదలతో విద్యను అభ్యసించి ఉన్నత స్థానాల్లో నిలువాలని జిల్లా విద్యాశాఖ ఎస్‌వో భాస్కర్ అన్నారు. రూమ్ టూ రీడ్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన జాతీయ చిత్ర లేఖనం పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన మిరుదొడ్డి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శుక్రవారం ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో ప్రవీన్ బాబు, హెచ్ఎంలు వెంకట రాజలింగం, పద్మావతి, శ్రీదేవి, శ్రీనివాస్, రమేశ్ పాల్గొన్నారు.


## విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలి




విద్యార్థులతో సీఐ, ఉపాధ్యాయులు

చేర్యాల, నవంబర్ 29: విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలని సీఐ శ్రీను కోరారు. మండలంలోని ఆకునూరు పాఠశాలలో శుక్రవారం పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు బాలికలు, మహిళల రక్షణకు ఉన్న చట్టాలు, సైబర్ నేరాలు, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, సోషల్ మీడియా, సెల్‌ఫోన్ తదితర అంశాల పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశే చాలా కీలకమని, సక్రమమార్గంలో వెళ్లేవారు ఉన్నత స్థాయికి చేరుకుంటారన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని,సమస్య తలెత్తితే వెంటనే 100 లేదా వాట్సాప్ నెంబర్ : 8712667473కి ఫోన్ చేయాలని కోరారు. కార్యక్రమంలో హెచ్ఎం ఐలయ్య, ఉపాధ్యాయులు, హుస్నాబాద్ డివిజన్ షీటీమ్ బృందం సభ్యులు సైదయ్య, ప్రశాంతి, కృష్ణ, శివకుమార్ పాల్గొన్నారు.

## పంతుళ్లు సర్వేలో....విద్యార్థులు గల్లీలో



కుక్క పిల్లలతో ఆడుకుంటున్న చిన్నారులు



హోంవర్క్ చేసుకుంటున్న విద్యార్థులు

*చేర్యాల, నవంబర్ 29 : సమగ్ర కుటుంబ సర్వే పేరిట సర్కారు బడి పంతుళ్లు ఒకపూట పాటలు చెప్పి వెళ్లిపోతుండడంతో చిన్నారులు గల్లీలో ఆటలు ఆడుకుంటున్నారు. మండలంలోని కడవేర్గులో టీచర్లు సర్వే చేసేందుకు బడికి తాళం వేసి వెళ్లిపోవడంతో విద్యార్థులు గల్లిలో కుక్క పిల్లలతో ఆటలు ఆడుకుంటున్నారు. మరో ప్రదేశంలో టీచర్లు ఇచ్చిన హోంవర్క్ చేసుకుంటుండగా మరికొందరు పిల్లలు వారిని డిస్టబ్ చేస్తున్న చిత్రాలను శుక్రవారం 'నమస్తే తెలంగాణ' క్లిక్ మనిపించింది.*

## గిరిజన నాయకులు ముందస్తు ఆరెస్టు

అక్కన్నపేట, నవంబర్ 29: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన గిరిజన నాయకులను శుక్రవారం అక్కన్నపేట పోలీసులు ముందస్తుగా ఆరెస్టు చేశారు. ఈ సందర్భంగా గిరిజన నాయకులు భూక్యా కృష్ణనాయక్, నునావత్ మోహన్‌నాయక్ మాట్లాడుతూ.. .హైదరాబాద్‌లో గిరిజన బాలిక ఇస్లావత్ శ్రావ్యపై లైంగికదాడి చేసిన నిందితులను శిక్షించాలన్నారు. నిరసన కార్యక్రమానికి వెళ్లకుండా పోలీసులు ఆరెస్టు చేశారన్నారు.

## నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం

మద్దూరు(ధూళిమిట్ట), నవంబర్29: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనాన్ని అందించాలని మద్దూరు ఎంపీడీవో రామ్మోహన్ అన్నారు. శుక్రవారం మద్దూరు మండలంలోని నర్సాయపల్లి ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను ఎంపీడీవో సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం గ్రామంలోని నర్సరీని సందర్శించి మొక్కల పెంపకానికి సిద్ధం చేయాలన్నారు. జూనియర్ అసిస్టెంట్ భాస్కర్,గ్రామ పంచాయతీ కార్యదర్శి భాస్కర్, టీఏ శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## విద్యార్థి అదృశ్యం.. జనగామలో లభ్యం

చేర్యాల, నవంబర్ 29: కొమురవెల్లి మల్లికార్జునస్వామి క్షేత్రంలో కొనసాగుతున్న ఆగమ పాఠశాలలో ప్రవర(రెండో సంవత్సరం) అభ్యసిస్తున్న చేర్యాల మండలంలోని వీరన్నపేట గ్రామానికి చెందిన ఓం నమశివాయ అనే విద్యార్థి గురువారం పాఠశాల నుంచి వెళ్లిపోయాడు. ఓం నమశివాయకు ఆగమ పాఠశాలలో భోజనం పడటం లేదు. దీంతో తల్లి సిద్ధమ్మ కొడుకు కోసం కొమురవెల్లిలో ప్రత్యేకంగా ఇల్లు కిరాయికి తీసుకుని అక్కడే జీవనం సాగిస్తూ కుమారుడిని ఆగమ పాఠశాలకు పంపిస్తున్నట్లు తెలిసింది. ఈ క్రమంలో వీరన్నపేటలో రేషన్ బియ్యం తీసుకునేందుకు తల్లి వెళ్లిన సమయంలో కుమారుడు ఓం నమశివాయ సైతం పాఠశాలల నుంచి వెళ్లిపోయాడు. రాత్రి వరకు ఇంటికి రాకపోవడంతో అనుమానం వచ్చిన తల్లి సిద్ధమ్మ కొమురవెల్లి పోలీసులను ఆశ్రయించింది. ఆగమ పాఠశాల అధ్యాపకుడు వీరేశాన్ని పిలిపించి విచారణ చేపట్టారు.వాట్సాప్ గ్రూపుల్లో ఓం నమశివాయ కనిపించడం లేదని శుక్రవారం పోస్టులు చెక్కర్లు కొట్టడంతో జనగామ జిల్లా కేంద్రంలో వీరన్నపేటకు చెందిన వ్యక్తులు విద్యార్థిని గుర్తించి తిరిగి ఇంటికి పంపించడంతో కథ సుఖాంతమైంది.


### కాంట్రాక్టు ఉద్యోగుల నిరసన

మిరుదొడ్డి, నవంబర్ 29: కాంట్రాక్టు ఉద్యోగల పట్ల సీఎం రేవంత్‌రెడ్డి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం మిరుదొడ్డి మండల అధ్యక్షుడు మహేశ్ అన్నారు. మిరుదొడ్డి మానవనరుల కార్యాలయం ఎదుట శుక్రవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. కాంట్రాక్టు ఉద్యోగులు కిష్ట య్య, మతిన్, విష్ణు, కృష్ణ, లత, మధు, మంజుల, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

**వర్గల్‌లో...**

వర్గల్, నవంబర్ 29: మండల కేంద్రంలో సమగ్ర శిక్షా ఉద్యోగులు నిరసన తెలిపారు. నల్లబ్యాడ్జీలు ధరించి, ప్లకార్డులు ప్రదర్శించారు. అసెంబ్లీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు న్యాయం చేయాలని కోరారు. టీఎస్‌ఎస్‌యూఎస్ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి, జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్, కరుణాకర్, వరలక్ష్మి, భూపాల్, బలరామ్, బ్రహ్మం, జనార్దన్, స్వామి, మహేందర్ పాల్గొన్నారు.

### ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి



నిరాశ్రయుల ఆశ్రమంలో జడ్జి స్వాతిరెడ్డి

సిద్దిపేట టౌన్,నవంబర్ 29 : వృద్ధులు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని జడ్జి స్వాతిరెడ్డి సూచించారు. సిద్దిపేట నిరాశ్రయుల వృద్ధాశ్రమాన్ని శుక్రవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా నిరాశ్రయులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నిరాశ్రయులు ఆశ్రమ మేనేజర్ రజిత,లాల్ బహదూర్ రురల్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్, న్యాయసేవాధికార సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

## గృహజ్యోతి కోసం వృద్ధుడి పడిగాపులు



ఎంపీడీవో కార్యాలయం ఎదుట వృద్ధుడు నర్సయ్య

మద్దూరు(ధూళిమిట్ట), నవంబర్29: ప్రభుత్వం అమలు చేస్తున్న గృహజ్యోతి పథకం కోసం వృద్ధుడు మండల ప్రజాపరిషత్ కార్యాలయం ఎదుట శుక్రవారం పడిగాపులు కాయడం తప్పలేదు. ధూళిమిట్ట మండలంలోని కూటిగల్ గ్రామానికి చెందిన జ్ఞానబోయిన నర్సయ్య అనే వృద్ధుడికి భార్యా పిల్లలు ఎవరూ లేరు. దీంతో ఒంటరిగా గ్రామంలోనే నివాసం ఉంటున్నాడు. ప్రభుత్వం గృహజ్యోతి కింద అందించే 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్ అందక కొన్నాళ్లుగా మండల ప్రజాపరిషత్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాడు. గతేడాది డిసెంబర్ 28 నుంచి 2024 జనవరి 6వ తేదీ వరకు జరిగిన ప్రజాపాలన గ్రామ సభలో ఆయన దరఖాస్తు చేసుకోలేదు. ఆ సమయంలో వృద్ధుడు గ్రామంలో అందుబాటులో లేక గృహజ్యోతి పథకం వర్తించడం లేదని అధికారులు తెలుపుతున్నారు.

## రాష్ట్ర స్థాయి పోటీలకు కుకునూరుపల్లి విద్యార్థులు

కొండపాక(కుకునూరుపల్లి), నవంబర్ 29 : మెదక్ పట్టణంలో నిర్వహించిన ఉమ్మడి మెదక్ జిల్లా ఎస్‌జీఎఫ్ అండర్ 14 టేబుల్ టెన్నిస్‌లో కుకునూరుపల్లిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి గైని భరద్వాజ్ ప్రథమస్థానం, రెడ్డమైన హర్షిత్ మూడో స్థానం, మోహిత్ ఐదో స్థానం, బాలికల విభాగంలో నంగి భానుప్రియ ఐదో స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఎంఈవో సత్తయ్య, వ్యాయామ ఉపాధ్యాయుడు క్యాతం రాజ్‌కుమార్ తెలిపారు. రాష్ట్ర స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు డిసెంబర్ రెండో వారంలో మెదక్ జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను తహసీల్దార్ మల్లికార్జున్‌రెడ్డి, పీఎన్‌ఆర్ ట్రస్ట్ చైర్మన్ నరేందర్, ఉపాధ్యాయులు అభినందించారు.

### ఆయిల్‌పామ్‌సాగుతో అధిక ఆదాయం

తొగుట, నవంబర్ 29: ఆయిల్‌పామ్‌సాగుతో అధిక ఆదాయం పొందవచ్చని ఉద్యానశాఖ మండల అధికారి డి.రమేశ్ అన్నారు శుక్రవారం మండలంలోని బండారుపల్లిలో ఆయిల్‌పామ్ తోటలను ఆయన సందర్శించి పరిశీలించారు. ఏవో మోహన్, రైతులు సత్యలింగం, శ్రీనివాస్‌రెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

**తీగుల్‌లో ..**

జగదేవపూర్, నవంబర్29: ఆయిల్ పామ్ సాగుతో ఆదాయం పొందవచ్చని ఏవో వసంతరావు అన్నారు. మండలంలోని తీగుల్‌లో ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలకు 100 శాతం రాయితీపై డ్రిప్ పరికరాలు, మొక్కలు అందిస్తున్నామన్నారు. మిగతా రైతులకు 80 నుంచి 90 శాతం రాయితీ కల్పిస్తున్నట్లు తెలిపారు.

### మాలల సింహగర్జనను విజయవంతం చేయాలి

మిరుదొడ్డి, నవంబర్ 29 : ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, బీజేపీ ఎన్ని కుట్రలు చేసినా ఎస్సీ వర్గీకరణకు మాలలు ఒప్పుకునేది లేదని జాతీయ మాల మహానాడు మండల అధ్యక్షుడు దార స్వామి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మండల యాదగిరి అన్నారు. శుక్రవారం మిరుదొడ్డిలో వారు విలేకరులతో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేఖంగా డిసెంబర్ 1వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న మాలల సింహగర్జన సభకు గ్రామాల్లోని మాలలందరూ తరలి రావాలని పిలుపునిచ్చారు.

### కొండపోచమ్మ హుండీ ఆదాయం రూ.8,33,393

జగదేవపూర్, నవంబర్ 29: మండలంలోని కొండపోచమ్మ ఆలయం హుండీ లెక్కింపును దేవాదాయశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టారు. అమ్మవారికి మొత్తం రూ. 8,33,393 ఆదాయం వచ్చినట్లు ఉమ్మడి మెదక్ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్, ఆలయ కార్యనిర్వహణ అధికారి రవికుమార్, దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ రంగారావు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రజితారమేశ్, డైరెక్టర్లు చెక్కల రమేశ్, గమల్లు, కోట ఆశయ్య, ఆలయ సిబ్బంది మహేందర్‌రెడ్డి, కనకయ్య, పూజారులు లక్ష్మణ్, తిరుపతి, గోవర్ధన్, సిబ్బంది హరి, చిన్న పాల్గొన్నారు.

### వాహనదారులకు జరిమానా

సిద్దిపేట టౌన్, నవంబర్ 29: మద్యం తాగి వాహనాలు నడిపిన మందుబాబులకు సిద్దిపేట న్యాయస్థానం శుక్రవారం జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చింది.సిద్దిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ వివరాల ప్రకారం.. ట్రాఫిక్ సర్కిల్ పరిధిలోని నర్సాపూర్, ఎంపీడీవో చౌరస్తాలో రాజీవ్‌రహదారిపై పోలీస్ సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ఐదుగురు మందు బాబులను పట్టుకున్నామన్నారు. ఈ మేర కు సిద్దిపేట స్పెషల్ సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కాంతారావు ముందు హాజరుపర్చగా విచారణ జరిపిన వాహనదారు లకు రూ. 8,500 జరిమానా విధించారు

### పేదలకు దుప్పట్లు పంపిణీ

కొమురవెల్లి, నవంబర్ 29: కొమురవెల్లిలో శుక్రవారం పుట్టినరోజును పురస్కరించుకొని బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు, బీఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బొంగు రాజేందర్ రెడ్డి పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు.

### విజయవంతం చేయాలి

సిద్దిపేట కమాన్, నవంబర్ 29: ధర్మ సమాజ్ పార్టీ మహాసభను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బోయిని సదన్ మహరాజ్ అన్నారు. శుక్రవారం మహాసభకు సంబంధించిన మాట్లాడుతూ డిసెంబర్ 15న జిల్లా కేంద్రంలో ధర్మ సమాజ పార్టీ జిల్లా మహాసభ నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు జ్యోతి, జిల్లా ప్రధాన కార్యదర్శి డీబీ. రాజు, జిల్లా నాయకులు వేముల ప్రసన్న, చెంచల ఎల్లన్న, మహంకాళి సురేశ్ పాల్గొన్నారు.

### రుద్రేశ్వర ఆలయంలో మంత్రి పూజలు

కొండపాక(కుకునూరుపల్లి), నవంబర్ 29: కొండపాక మండల కేంద్రంలోని రుద్రేశ్వర ఆలయాన్ని శుక్రవారం రవాణా శాఖ, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్ మనుచౌదరితో కలిసి సందర్శించారు. ఆలయంలో పూజలు చేశారు. డీసీసీ ప్రెసిడెంట్ నర్సారెడ్డి, డీసీసీబీ చైర్మన్ దేవేందర్‌రెడ్డి, తెలంగాణ కాంగ్రెస్ ఇంటలెక్చువల్ కమిటీ చైర్మన్ శ్యామ్‌మోహన్, కాంగ్రెస్ కొండపాక, కుకునూరుపల్లి మండలాధ్యక్షులు లింగారావు, శ్రీనివాస్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ భూంరెడ్డి పాల్గొన్నారు.

### ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్చాలి

గజ్వేల్, నవంబర్ 29: ట్రిపుల్‌ఆర్ ఉత్తర భాగంలో అలైన్‌మెంట్ మార్చాలని కోరుతూ శుక్రవారం గజ్వేల్ ఆర్డీవో కార్యాలయంలో నెంటూర్, సామలపల్లి, బేగంపేట గ్రామాలకు చెందిన రైతులు వినతి పత్రం అందజేశారు. అభివృద్ధి పేరిట పచ్చని పంట పొలాలను లాక్కుంటూ రైతులను అడ్డ కూలీలుగా మారుస్తున్నారని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు మల్లేశం, జోసఫ్, కనకరాజు, కార్తీక్, అంజయ్య, పాపయ్య, సత్యం, మహేశ్, రాజమల్లయ్య పాల్గొన్నారు.